గాయత్రీ జయంతి ప్రత్యేకం

# తారక మంత్రం - గాయత్రీ మంత్రం

గాయత్రీ మంత్రాన్ని తారక మంత్రం అని కూడా అంటారు. ఎన్నో సాధనా గ్రంథాల్లో దీన్ని ఈ పేరుతోనే పేర్కొన్నారు. తారక అంటే తరింపజేసేది, దాటించేది, మునగకుండా తేలుతూ ఉండేట్టు చేసేది. లోతుగా ఉన్న నీటి ప్రవాహం నుండి రక్షించి దాటించేదాన్ని తారకం అంటారు. చాలామంది ఈ భవసాగరంలో మునిగిపోతుంటారు. కొద్దిమంది మాత్రమే తేలుతుంటారు. ఈ విధంగా తరింపచేయగల సాధనని తారకం అంటారు. గాయత్రీ మంత్రంలో ఈ సామర్థ్యం ఉంది కాబట్టే దీన్ని తారక మంత్రం అన్నారు.

గాయత్రీ మంత్రం ఎందుకు తారకమైందో తెలుసుకునే ముందు, మనిషిలోని సమర్థత- అసమర్థత, సాఫల్యం-వైఫల్యం, జీవిత ఉద్దేశపూర్తికి అవసరమైన సార్థకత-నిరర్థకతను నిర్ధారించే శక్తి ఏమిటి అనేది తెలుసుకోవాలి. **ఒక్కమాటలో తెలుసుకోవాలంటే ప్రాణశక్తే మనిషిలోని జీవనీ శక్తి.** ఇది తగ్గితే మనిషి అవసరమైనంత పరాక్రమాన్ని ప్రదర్శించ లేక, సగంలోనే ఆపేసి నిరాశ చెందుతాడు. భౌతిక, ఆధ్యాత్మిక క్షేత్రాల్లో కోరుకున్నది దక్కించుకోవడానికి అవసరమైన సామర్థ్యం ఉండి తీరాలి. లేని పక్షంలో లక్ష్యాన్ని ఛేదించడం, కోరుకున్నది దక్కించుకోవడం అసాధ్యమే. గొప్ప పని చేయాలంటే దానికి కావలసిన వనరులు సమకూర్చుకొని తీరాలి. భౌతిక వస్తువుల కన్నా వ్యక్తిత్వంలో ప్రఖరత, ఓజస్సు ఉండడం మరింత ముఖ్యం అని వేరే చెప్పనక్కర్లేదు.

పరికరాలను ఉపయోగించుకోవడానికి కూడా శౌర్యం, ధైర్యం, సంతులన చాలా అవసరం. చేతిలో మంచి తుపాకీ ఉన్నా, మనస్సులో పిరికితనం, తడబాటు ఉంటే ఆ తుపాకీ మాత్రం ఏం చేయగలదు? అసలు పేలదు, పేలినా గురి తప్పుతుంది, శత్రువు సునాయాసంగా చేతిలోంచి దానిని లాక్కుని దాడి చేస్తాడు. అదే ధైర్యవంతులైతే, కర్రలతోనే దుండగులను సమర్థవంతంగా ఎదుర్కొంటారు. 'సాహసవంతులకు ఈశ్వరుడు సహకరిస్తాడు' అని ఊరికే అనలేదు. **అన్ని విజయాలకి మూలం ప్రాణశక్తి సమకూర్చి పెట్టే ధైర్యం, దృఢత్వం, తపన, సంసిద్ధతలు. ఇదే సత్యం. ఈ విభూతులన్నీ ప్రాణశక్తికి సహచరులు.**

దీపంలో నూనెలాగా మనిషి కళ్ళల్లో, వాక్కులో, భావాల్లో, బుద్ధిలో, ఆలోచనల్లో ప్రకటమయ్యే తేజస్సే ప్రాణం. మనిషి జీవితంలోని అసలైన శక్తి ఇదే. ఈ ఒక్క ప్రత్యేకత వల్లనే లెక్కలేనన్ని సౌకర్యాలు, సానుకూలతలు వాటంతటవే పుట్టి, కూడగట్టుకుని, ఆకర్షించబడుతూ ఉంటాయి. ఈ విభూతి లేని వారి సంపదలను బలవంతులు అపహరించుకుంటారు. బలహీనుడిని గుర్రం ఎత్తి పడేస్తుంది. బలహీనుల సంపదలు ఇతరులకి వెళ్ళిపోతాయి.

సంరక్షించుకోగల సామర్థ్యం లేని వారు సముపార్జించుకున్న వేటినీ తమ దగ్గర నిలుపుకోలేరు. దౌర్బల్యాల దగ్గర విభూతులు నిలవవు. ఈ తథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తెలివైన వారు తమ సమర్థత, ప్రాణశక్తులను నిలుపుకోవడానికి, పెంపొందించుకోవడానికి భౌతిక, ఆధ్యాత్మిక ప్రయత్నాలు చేస్తూ ఉండాలి. ఆధ్యాత్మిక ప్రయత్నాలతో **ప్రాణశక్తిని సంస్కరించే అత్యుత్తమ ప్రక్రియ గాయత్రీ ఉపాసన.** దాని నామకరణం కూడా ఈ ఆధారంగానే జరిగింది.

**ప్రాణశక్తే శరీరంలో ఆరోగ్యం, ఆయుష్షు, స్థిరత్వం, రూప లావణ్యంగా ప్రకాశిస్తుంది. అదే మనస్సులో తెలివి, మేధ, ప్రజ్ఞలుగా ప్రతిష్ఠితమై ఉంటుంది. శౌర్యం, ధైర్యం, నిష్ఠ, దృఢత్వం, తపన, సంయమనం, సహృదయత, ఔదార్యం, దూరదృష్టి, వివేకాలను బట్టి ప్రాణశక్తి స్థాయి పరిగణించబడుతుంది. వ్యక్తిత్వంలోని సంపూర్ణ తేజస్సుకి ఆధారం ప్రాణశక్తి.** శాస్త్రకారులు దీని గొప్పతనాన్ని ముక్తకంఠంతో ఎలుగెత్తి చాటారు. ఈ సృష్టిలోని సర్వోత్తమ ప్రఖరత గురించి తెలుపుతూ మనుషులకు ఈ శక్తి కేంద్రం గురించి ఎరుకతో ఉండమని హెచ్చరించారు. జీవిత లక్షాన్ని పొందాలంటే ఈ శక్తి భాండాగారాన్ని గుర్తుంచుకుని, దాన్ని సముపార్జించుకుని, వికసింపజేసుకునే ప్రయత్నం చేస్తూ ఉండాలని సూచించారు.

**గాయత్రీ సాధన మనిషిని ప్రాణంతో నింపి, అందులో ప్రఖరతను పెంపొందిస్తుంది. గాయత్రి అంటేనే ప్రాణాలను రక్షించేది అని అర్థం. ఈ విధంగా ప్రాణవంతులై, ఎన్నో ప్రఖర శక్తులు లభించడం వల్ల అడుగడుగునా విజయం సాధిస్తారు.** సమాజంలో విపత్తులు, లోటు, శోకం సంతాపాలకు కారణం ప్రాణలేమి. బలహీనులను అన్ని వైపులనుండి ఆక్రమిస్తారు, దైవం కూడా వారిని ఆపదలపాలు చేస్తుంది. అలాంటి వారికి అదృష్టం కూడా కలిసిరాదు. శవం మీదకి కాకులు, రాబందులు వచ్చి పడ్డట్టుగానే తత్త్వహీనుడైన మనిషి పరిస్థితి ఉంటుంది. కాబట్టి బుద్ధిమంతులు ప్రాణాన్ని ఆశ్రయించి తీరాలి.

**ప్రాణో వై బలం. ప్రాణో వై అమృతం ।**
**ఆయుర్నః ప్రాణః రాజా వై ప్రాణః ॥ - బృహదారణ్యకం**

ప్రాణమే బలము, ప్రాణమే అమృతం. ప్రాణమే ఆయువు, ప్రాణమే రాజు.

ప్రతి కష్టం వెనుక ఒక బహుమతి ఉంటుంది

**యో వై ప్రాణః సా ప్రజ్ఞ, యా వా ప్రజ్ఞ స ప్రాణః**
**– సాంఖ్యాయనం**

ఏది ప్రాణమో అదే ప్రజ్ఞ. ఏది ప్రజ్ఞో అదే ప్రాణం.

**యావద్ధయాస్మిన్ శరీరే ప్రాణోవసతి తావదాయుః. – కౌషీతకి**

శరీరంలో ప్రాణమున్నంత వరకే జీవితం ఉంటుంది.

**ప్రాణో వై శుశర్మ సుప్రతిష్ఠాన్ – శతపథ**

ఈ శరీర రూప నావకు ప్రాణమే సుప్రతిష్ఠ.

**ఏతావజ్జన్మసాఫల్యం దేహినామిహ దేహిషు ।**
**ప్రాణైరర్థైర్ధియా వాచా శ్రేయ ఏవాచరేత్సదా ।**

ప్రాణము, ధనము, బుద్ధి, వాక్కులతో శ్రేయస్కరమైన పనులు చేయడంలోనే దేహధారులకు జన్మ సాఫల్యం.

**యా తే తనూర్వాచి ప్రతిష్ఠితా యా శ్రోత్రే యా చ చక్షుషి।**
**యా చ మనసి సంతతాశివాం తాం కురుమోత్క్రమీః ॥**

హే ప్రాణమా! వాక్కులో, చెవుల్లో, కళ్ళల్లో, మనస్సులో ఉన్న నీవు వాటిని కళ్యాణప్రదం గావించు. మా దేహాన్ని విడిచి వెళ్ళకు.

**ప్రాణస్యేద వశే సర్వం త్రిదివేయత్ ప్రతిష్ఠితమ్ ।**
**మాతేవ పుత్రాన్ రక్షస్వ ప్రజ్ఞాం చ విదేహిన ఇతి ॥**

హే ప్రాణమా! ప్రపంచంలో, స్వర్గంలో ఉన్నవన్నీ నిన్ను ఆశ్రయించినవే. కాబట్టి ప్రాణమా, నీవు తల్లిదండ్రులలాగా మా సంరక్షకుడివి కమ్ము, మాకు ధనము, బుద్ధి ఇవ్వు.

వ్యక్తి యొక్క వ్యక్తిత్వమే కాక సృష్టిలోని ప్రతి కణము ఆ ప్రాణశక్తి యొక్క తేజస్సుతోనే వెలుగుతోంది. **జీవితం, వెలుగు, ఉత్సాహం, ఆనందం, అందం ఎంత ఎక్కువ ఉంటే అక్కడ అంత ప్రాణం ఉందని అర్థం చేసుకోవాలి.** నిర్మాణ సామర్థ్యం ప్రాణంలో మాత్రమే ఉంది. సృష్టి, ఆవిష్కరణ, నిర్మాణం, వ్యాప్తి, వికాసక్రమం ఏవైతే కొనసాగుతున్నాయో వాటికి మూలం పరబ్రహ్మ యొక్క పరాచైతన్యమే. చైతన్యంలాగానే పంచ జడతత్త్వాలు సక్రియంగా ఉండడానికి ఆధారం ప్రాణం. దీని నుండే పరమాణువులు తమ సామర్థ్యాన్ని గ్రహిస్తాయి, దాని ప్రేరణతోనే అవి తమ అక్షంలో, కక్ష్యలలో పరిభ్రమిస్తూ ఉంటాయి. బ్రహ్మాండంలోని గ్రహ నక్షత్రాలన్నిటి గతివిధులు ఈ ప్రాణశక్తి నుండే ప్రేరితులవుతాయి.

**ప్రాణాద్ధేయ వ ఖల్విమాన భూతాని జాయన్తే ।**
**ప్రాణాని జాతాని జీవన్తి ప్రాణ ప్రయస్త్యభి సంవిశాన్తితి ॥**
**– తైత్తరీయ ఉపనిషత్తు**

ప్రాణశక్తి నుండే ప్రాణులన్నీ పుడతాయి. పుట్టాక ప్రాణంతోనే జీవిస్తాయి. చివరికి ఆ ప్రాణంలోనే ప్రవేశిస్తాయి.

**సర్వాణి హవా ఇమాని భూతాని ప్రాణమేవ ।**
**భిషం విషన్తి, ప్రాణమయుమ్యుంజిం హతే ॥**
**– ఛాందోగ్యఉపనిషత్తు**

ప్రాణులన్నీ ప్రాణం నుండి ఉత్పన్నమై, ఆ ప్రాణంలోనే లీనమైపోతాయి.

**అపశ్యం గోపామనిపద్యమానమా, చ పరా చ పథిభిశ్చరన్తం ।**
**స సధ్రీచీః స విషూచీర్వసా న ఆవరీవర్తి భువనేశ్వన్తః ॥**
**– ఋగ్వేదం 1.164.31**

**నేను ప్రాణాల్ని చూసాను, సాక్షాత్కరించుకున్నాను. ఈ ప్రాణమే అన్ని ఇంద్రియాలకు రక్షణ కల్పిస్తుంది. ఇది ఎన్నటికీ నాశనం కాదు. ఇది వేరు వేరు మార్గాల ద్వారా, అంటే నాడుల నుండి వస్తూ, పోతూ ఉంటుంది. ముఖం, నాసిక ద్వారా క్షణక్షణం శరీరంలో ప్రవేశిస్తూ, బయటికి వెళ్తూ ఉంటుంది. శరీరంలో ఈ ప్రాణం వాయు రూపంలో ఉన్నప్పటికీ, అధిదైవిక రూపంలో ఇది సూర్యుడు.**

ప్రపంచమంతా వ్యాపించి ఉన్న ఈ ప్రాణశక్తి ఎక్కడ ఎక్కువగా సంతరించుకుని ఉంటుందో అక్కడ ఎక్కువ జీవం కనిపిస్తుంది. ఈ ప్రాణతత్త్వం ఎక్కువ ఉన్నందువల్లనే మనిషి మిగిలిన ప్రాణులకంటే ఎంతో తెలివి, బుద్ధి, సద్గుణాలు, సామర్థ్యాలు, సభ్యత కలిగి ఉంటాడు. ఈ మహాశక్తిని సామాన్య ప్రాకృతిక వస్తువులను ఉపయోగించుకోవటానికి మాత్రమే పరిమితం చేస్తే నరపశువుల వలె సామాన్య జీవితం గడపగలడు. కాని ఆధ్యాత్మిక విజ్ఞానంతో దాని పరిమాణాన్ని పెంచితే సాధారణ స్థాయి నుండి అత్యుత్తమ శిఖరాలను చేరుకోగలడు. న్యూన స్థితిలో పడుంటే జీవితంలో సునాయాసంగా లభించే ఆనందం, ఉల్లాసం దూరమవుతాయి. మనోవికారాలు, వాటి దురదృష్టకర ప్రతిక్రియల వల్ల కలిగే కష్ట నష్టాలను సహించడమే నరకం. భూమిమీద చాలామంది మనుష్యులు శారీరిక నరకాన్ని అనుభవిస్తూనే జీవితాన్ని గడుపుతుంటారు. ఆంతరిక దౌర్బల్యాల వల్ల ఎన్నో గొప్ప విజయాలను కోల్పోతారు. ఈ స్థితిని వదిలించుకోవాలంటే ప్రాణశక్తిని సంపాదించుకోవడం ఎంతైనా అవసరం.

**గాయత్రీ మహామంత్రం ద్వారా ఈ ప్రాణతత్త్వాన్ని కావలసినంత సంపాదించుకోవచ్చు. దీనితో మనిషి తాను దైవీ జీవితాన్ని గడుపుతూ, భవసాగరాన్ని దాటి, ఇతరులను కూడా తరింప జేయగలడు. ఈ గొప్పతనం, సామర్థ్యం వల్లనే గాయత్రీ మంత్రాన్ని తారక మంత్రం అన్నారు.** పద్ధతిగా మంత్రాన్ని ఆశ్రయించిన వారికి వెంటనే ఈ సమగ్ర జీవనీశక్తి అభివృద్ధి చెందడం కనిపిస్తుంది. వెలుగు పెరుగుతున్నకొద్దీ చీకటి తగ్గిపోతూ ఉంటుంది. అలాగే ఆంతరిక సామర్థ్యం పెరుగుతున్న కొద్దీ దుఃఖ దారిద్రాలకు నిలయంగా కనిపించే జీవితం, ప్రపంచాన్ని భవసాగరంగా చిత్రీకరించే నరక వాతావరణం కూడా అంతమై పోతుంది.

*– అఖండజ్యోతి, ఫిబ్రవరి 1984*
*అనువాదం: శ్రీ ఎం.వి.ప్రసాద్, జయలక్ష్మి*

**విజయం కష్టపడే వారి నుంచి ఎక్కువకాలం తప్పించుకోలేదు**